క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


కిషన్‌రాజు


చల్లా కార్తీక

మధిర: జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో మధిర శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక య్యారు. అండర్–14 విభాగం నుంచి 8వ తరగతి విద్యార్థి పెరుమాళ్లపల్లి కిషన్‌రాజ్ లాంగ్ జంప్‌లో, చల్లా కార్తీక కబడ్డీలో సత్తా చాటారని కరస్పాండెంట్ బి.అంజన్‌బాబు తెలిపారు. వీరిని కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు చందు, వెంకటనారాయణ, పీఈటీ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొణిజర్ల: ఇటీవల హనుమకొండలో జరిగిన అండర్ –14 రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో కొణిజర్ల మండలం తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో 23 కేజీల విభాగం నుంచి ఎం.శ్రీజ, 36 కేజీల విభాగంలో ఏ.సుస్మిత, 40 కేజీల విభాగంలో ఎం.మన్విత ప్రియదర్శిని బహుమతులు సాధించారు. వీరిని హెచ్‌ఎం డి.అబ్రహం, పీడీ దొండపాటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పుష్పలత, డాక్టర్ సమీరలు పలువురి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిలో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి పలు సూచనలు చేశారు. పౌష్టికాహారంలో భాగంగా ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు తీసుకోవాలని, ప్రతి రోజు క్రమం తప్పకుండా ఐరన్–ఫోలిక్ మాత్రలు తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని, దీంతో ఆర్థికంగా భారం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సరళ, స్నేహ, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

వైరారూరల్: మండలంలోని తాటిపూడి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు శుక్రవారం వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పర్పుల్ డీఎస్‌ఏ సొసైటీ వ్యవస్థాపన అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాసరావు సహకారంతో బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు పెనుగొండ ఉపేంద్రరావు, బద్రీనాథ్, పంచాయతీ కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

ఏన్కూరు: ఈ నెల 11న హైదరాబాద్‌లో జరిగే మాదిగ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూరపాటి ప్రభాకర్ మాదిగ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీసీడీలు సాధించుకుంటే మన, మనపిల్లల భవిషత్ బాగుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పూర్ణకంటి మైసారావు, రాంబాబు, నాగేశ్వరరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురానికి చెందిన మందా శ్రీను గురువారం గడ్డి మందు తాగగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగించే శ్రీనుతో గ్రామానికే చెందిన నాగబోయిన కాశేశ్వరరావు, కోటా సురేష్ ఓ విషయంలో గొడవ పడ్డారు. ఈక్రమంలో ఆయనను తీవ్రంగా కొట్టగా మనస్థాపానికి గురైన శ్రీను గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి కాశేశ్వరరావు, సురేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ప్రారంభం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలో సత్య కూచిపూడి డ్యాన్స్ అకాడమీని మున్సిపల్ కమిషనర్ కె.సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామకృష్ణ, కృష్ణవేణి, బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, లావణ్య, దివ్య, అజయ్, రాధాకృష్ణ, దివ్య, సుహాసిని పాల్గొన్నారు.

అటకెక్కిన గొర్రెల పంపిణీ

- మండలంలో 920పైగా దరఖాస్తులు
- మూలన పడేసిన అధికారులు
- పద్దెనిమిది నెలలుగా ఎదురుచూపులు
- ఆందోళనలో లబ్ధిదారులు


గొల్లకురుమలకు పంపిణీ చేసిన గొర్రెలు (ఫైల్)

కొణిజర్ల: మండలంలో గొర్రెల పంపిణీ పథకం నత్త నడకన సాగింది. ఒక్కో గొల్లకురుమ కుటుంబాన్ని లక్షాధికారిని చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నీటి మూటగానే మారింది. గొర్రెలను మొదటి విడతలో అరకొరగా పంపిణీ చేసినా.. రెండో విడతలో ఊసే లేకుండా పోయింది.

మండలంలో 920పైగా దరఖాస్తులు..

కొణిజర్ల మండలంలో సుమారుగా 920 మందికి పైగా గొల్ల కురుమలు దరకాస్తు చేసుకున్నారు. మొదటి ఫేజ్‌లో ఒక్కో యూనిట్ రూ. 1.25 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ పోగా 25 శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉంది. అయితే రెండో విడతలో యూనిట్ కాస్ట్‌ను ప్రభుత్వం రూ. 1.75 లక్షలకు పెంచారు. దీనిలో సబ్సిడీ 75శాతం పోగా లబ్ధిదారులు తమ వాటాగా రూ.43,750 భరించాల్సి ఉంది. ఈ మేరకు కొణిజర్ల, తనికెళ్ల, చిన్నగోపతి, తుమ్మలపల్లి, సింగరాయపాలెం, సిద్దిక్‌నగర్, పల్లిపాడు, గుబ్బగుర్తి, సాలెబంజర తదితర గ్రామాల్లోని గొల్ల కురుమలు డీడీలు కట్టారు. ఒక్కో యూనిట్‌లో ఒక పొట్టేలు ఉండేలా 20 గొర్రెలకు కలిపి ఒక్కొక్కరు రూ.43,750 చొప్పున డీడీలు కట్టారు. ఒక్క కొణిజర్లలోనే 100 మంది డీడీలు కట్టారు.

డీడీలు కట్టి 18 నెలలు..

డీడీలు చెల్లించి దాదాపు 18 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు గొర్రెల పంపిణీ చేపట్టలేదు. 706 మంది డీడీలు కట్టగా వారిలో.. కేవలం 36 మందికే రెండో విడత గొర్రెలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి ఎప్పుడు పంపిణీ చేస్తారో అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం తాము చెల్లించిన డీడీల డబ్బులైన తిరిగి ఇవ్వండంటూ గొల్ల కురుమలు వెటర్నరీ వైద్యుల చుట్టూ తిరుగుతున్నారు. పశు వైద్యాధికారులు మాత్రం ఇదిగో రేపు, ఎల్లుండి అంటూ జరుపుకుంటూ వచ్చారు. ఇప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుండటంతో పథకం ఆగిపోతుందని ఒక వేళ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాకపోతే తాము చెల్లించిన డీడీల పరిస్థితి ఏంటో అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

రూ.90 వేలు చెల్లించా..



నాకు, నా కుమారుడు ఇద్దరికి యూనిట్లు మంజూరయ్యాయి. ఇద్దరి పేరు మీద రూ.90 వేలు డీడీలు కట్టాం. ఇప్పటికీ 18 నెలలు గడిచినా గొర్రెలు రాలేదు. కొంత మందికే గొర్రెలు పంపిణీ చేశారు. అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా పట్టించుకున్న వారే లేరు. మా సంఘం నాయకులు, రాష్ట్ర నాయకులు మాట్లాడినా లాభం లేకుండా పోయింది. మా డబ్బులు మాకు తిరిగి ఇచ్చినా ఫర్వాలేదు.
– దేవర శ్రీను, కొణిజర్ల

ప్రభుత్వ నిర్ణయం మేరకే..



ప్రభుత్వ నిర్ణయం మేరకే గొర్రెల పంపిణీ నిలిపివేయడం జరిగింది. లబ్ధిదారులు చెల్లించిన డీడీలకు సంబంధించిన డబ్బులు ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల ఖాతాలో వేసింది. ప్రభుత్వం ఎన్నికల అనంతరం తిరిగి గొర్రెల పంపిణీ చేపడుతుందా లేక ప్రభుత్వం మారితే పథకం కొనసాగుతుందా అనేది తెలియదు. లబ్ధిదారులు గొర్రెలు వద్దు అనుకుంటే వారి డీడీల డబ్బులు వారికి తిరిగి చెల్లించడం జరుగుతుంది.
– డి.శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి, కొణిజర్ల

తొలిరోజు నామినేషన్లు నిల్


వైరా: ఆర్‌ఓ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీ, సీఐ


సత్తుపల్లి ఆర్‌ఓ కార్యాలయం వద్ద సీఆర్‌పీఎఫ్‌తో బందోబస్తు

వైరా: వైరా నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. తొలిరోజు ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదని రిటర్నింగ్ అధికారి బి.సత్యప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏసీపీ యంఏ రహమాన్, సీఐ సాగర్ నాయక్ సారథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు తహసీల్ వద్ద సామాన్యులు ఎవరినీ అనుమతించలేదు. నామినేషన్లు 13 దరఖాస్తులు తీసుకెళ్లినట్లు ఆర్‌ఓ తెలిపారు. యూసీసీ ఐఎంఎల్‌కు చెందిన అభ్యర్థి వర్సా రాములు నామినేషన్ దాఖలు చేసేందుకు రాగా సమయం మించి పోయిందని ఆర్‌ఓ సత్యప్రసాద్ తెలపడంతో వెనుదిరిగి వెళ్లి పోయాడు.

సత్తుపల్లి: సత్తుపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం నిరంతర సీసీ నిఘాను ఏర్పాటు చేశారు. తొలిరోజు నామినేషన్ ముగిసే సమయానికి ఒక్కనామినేషన్ కూడా దాఖలు కాలేదు.


మధిరలో..

కల్లూరు ఏసీపీ రామానుజం ఆధ్వర్యాన సీఐలు మోహన్‌బాబు, హనూక్, ఎస్సైలతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలను బందోబస్తుకు వినియోగిస్తున్నారు. తహసీల్‌లో రిజిస్ట్రేషన్లు ఉన్న లబ్ధిదారులు స్లాట్ బుకింగ్ పత్రాలను, సిబ్బంది ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డు చూపిస్తేనే లోనికి అనుమతిస్తున్నారు. అదే కార్యాలయం ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినా. సబ్ రిజిస్ట్రార్, సబ్‌జైల్, ఎస్టీఓ కార్యాలయాలకు వెళ్లేందుకు జలగంనగర్ మీదుగా దారిని మళ్లించారు.

భట్టి విక్రమార్కను గెలిపించండి


ప్రచారం నిర్వహిస్తున్న మల్లు సూర్య విక్రమాదిత్య

మధిర/ఎర్రుపాలెం: నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్కను గెలిపించాలని ఆయన తనయుడు మల్లు సూర్యవిక్రమాదిత్య పిలుపునిచ్చారు. శుక్రవారం మధిర పట్టణంలోని ముస్లిం బజారులో ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. అదే విధంగా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం గ్రామంలో కాంగ్రెస్‌నాయకులు భట్టి గెలుపుకై ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 100 రోజులలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని వివరించారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోనా ధని కుమార్, మిరియాల రమణ గుప్తా, రంగా శ్రీనివాస రావు, మొండితోక సుధాకర్, యర్రగుంట రమేష్, టీవీ రెడ్డి కర్నాటి రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణరావు, నర్సింహారావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, జానీబాషా, రాజీవ్ గాంధీ, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రెబల్‌గా పోటీ చేస్తా


రమేష్

మధిర: మధిర బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న నాయకుల వ్యవహార తీరు నచ్చక అసెంబ్లీ ఎన్నికల్లో రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుడు కల్యాణం రమేష్ అన్నారు. మధిర పట్టణంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ నాయకుడు కేసీఆర్ అని, స్థానిక నాయకత్వంపై అసంతృప్తితో మధిర అసెంబ్లీ ఎన్నికల్లో రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. మధిర మండలం రొంపిమళ్ల బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా పనిచేస్తున్నానన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారు కొందరు పరోక్షంగా మద్దతు తెలుపుతున్నారన్నారు. రెండు మూడు రోజుల్లో నామినేషన్ వేస్తానన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు పోటీ చేయనున్నట్లు వివరించారు.

కాంగ్రెస్ అవకాశమిస్తే..



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ

కల్లూరు రూరల్: కాంగ్రెస్ అవకాశమిస్తే సత్తుపల్లి నుంచి పోటీ చేస్తానని పాలేరు మాజీ ఎమ్మెల్యే కత్తుల శాంతయ్య కుమార్తె కత్తుల అరుణ తెలిపారు. కల్లూరులో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత 60 సంవత్సరాలుగా తమ కుటుంబం కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రజా సేవ చేస్తున్నామన్నారు. పార్టీ టిక్కెట్ నాకు కాకుండా ఎవరికిచ్చినా నా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అర్జున్‌రావు, వీరబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగొండ: ముదిగొండ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని పారిశ్రామిక వినియోగదారులకు శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ ఎం శ్రీనివాస్ బుధవారం ఒకప ప్రకటనలో తెలిపారు. దీనికి పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక




అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను, మధార్‌షావలీ

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురంలో రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీ శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కనపర్తి శ్రీనివాసరావు, సయ్యద్‌మధార్‌షావలీ, ఉపాధ్యక్షురాలిగా ధనియాకుల వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శిగా మూల రమేష్, కోశాధికారిగా ఇనుప రామారావు, గౌరవ అధ్యక్షుడిగా రాయల నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి


సత్తుపల్లి: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సండ్రవెంకటవీరయ్య , నాయకులు

సత్తుపల్లి/పెనుబల్లి: ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం ఆయన సత్తుపల్లి పట్టణంలోని హనుమానగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో తెల్లవారుజామున ముహూర్తం ప్రకారం ఎన్నికల ప్రచారరథం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తుపల్లి మండలం రామానగరం నుంచి ఎన్నికల ప్రచారరథం ఎక్కి రెండో విడత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అదే విధంగా పెనుబల్లి మండలంలోని వీఎంబంజర్, కర్రాలపాడు, టేకులపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ.. బీఆర్‌ఎస్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దళితబంధు పథకం అందరికీ అందించి ఒక రోజు మనతో గడుపుతారని, దీనిపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో హుజూరాబాద్ తర్వాత సత్తుపల్లిలోనే దళితబంధు అమలు చేసేందుకు జీఓ ఇచ్చారన్నారు. వచ్చే సంక్రాంతి నుంచి కేసీఆర్ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలు అమల్లోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రామానగరం సర్పంచ్ కళావతి, ఎంపీపీలు అలేఖ్య, హైమావతి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, రఫీ, మహేష్, రామారావు, హరికృష్ణారెడ్డి, వాసురెడ్డి, ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ మోహన్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు, ప్రసాద్, వెంకటేశ్వరరావు, శ్రీను, సుధాకర్, సురేష్, తావు, పంతులీ, ఝాన్సీ, వినీల్, అశోక్‌కుమార్, గిరిజాపతిరావు, తాతారావు, ప్రసాద్, చెన్నారావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల విస్తృత ప్రచారం

సండ్ర వెంకటవీరయ్యను గెలిపించాలని..


ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తల్లాడ: తల్లాడలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నాయకులు మేనిఫెస్టో వివరించారు. నవంబరు 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి సండ్ర వెంకటవీరయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, పట్టణ అధ్యక్షుడు జీవీఆర్, జోన్ చైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, దూపాటి నరేష్ రాజు, మండల కో–ఆప్షన్ సభ్యులు ఎస్.కె.ఈసూబ్, చల్లా నాగులు, గుడిబండ్ల మహేష్, రంగారావు పాల్గొన్నారు.

కమల్‌రాజ్‌ను గెలిపించాలని..

ముదిగొండ: మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని గోకినేపల్లి, ముదిగొండ, వల్లభిలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రణాళికలో ఉన్న పథకాలకు సంబంధించి నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మందరపు లక్ష్మి, పోట్ల కృష్ణకుమారి, జిల్లా నాయకులు పోట్ల ప్రసాద్, ఎర్ర వెంకన్న, మీగడ శ్రీనివాస్‌యాదవ్, ధర్మారావు, రామారావు, రమేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నమ్మకం ఉంటే చర్చకు రండి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మట్టా దయానంద్, నాయకులు

సత్తుపల్లిటౌన్: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామనే నమ్మకం ఉంటే ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చర్చకు రావాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సవాల్ చేశారు. ఎమ్మెల్యే చర్చకు రావాలని గురువారం చేసిన సవాల్‌పై సత్తుపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు బైటాయించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాసరావు, గాదె చెన్నకేశవరావు, చల్లారి వెంకటేశ్వరరావు, నరుకుళ్ల అప్పారావు, ఎండి కమల్‌పాషా, సందీప్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, అలవాల కరుణాకర్, దొడ్డా శ్రీనివాసరావు, ధనంజయ్‌రావు, మామిళ్ల సత్యనారాయణ, ప్రసాద్, నాగేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

రాధా కృష్ణమూర్తిని కలిసిన కొండూరి

కల్లూరు రూరల్: సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొండూరి సుధాకర్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రముఖ వైద్యులు రాధాకృష్ణమూర్తిని కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాసా వెంకటేశ్వరావు, కాటేపల్లి కిరణ్‌కుమార్, కె.వెంకటేశ్వరావు, శ్రీను, శ్రీనివాసరావు, సురేష్, మంగపతి, మహబూబ్, నాగరాజు, వెంకటరత్నం, హనుమంతు, ప్రసాద్, అమ్మలు, అజీజ్, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని 27 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 57 మంది శిక్షణ పొందిన ఫీల్డ్ ఇన్విజిలేటర్‌లతో సుమారు 1,000 మంది విద్యార్థులకు శుక్రవారం ఎస్‌ఈఏఎస్–2023 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు మండల అబ్జర్వర్లుగా ఎంఈఓ రాములు, ఎంఎస్‌ఓ ఎస్.రాజేశ్వరరావులు వ్యవహరించారు.

వృద్ధుడిని చేరదీసిన ఆర్కే ఫౌండేషన్ సభ్యులు


ఆశ్రమానికి తరలిస్తున్న నిర్వాహకులు

ఎర్రుపాలెం: మండలంలోని కండ్రిక గ్రామానికి చెందిన మాలోతు చంద్రు (74) గత 3 రోజులుగా మీనవోలు పెట్రోల్ బంకు సమీపంలోని కట్లేరు బ్రిడ్జి వద్ద రోడ్డు పక్కన పడుకున్నాడు. దీనిని గమనించిన స్థానికులు శుక్రవారం మధిర ఆర్కే ఫౌండేషన్ అనాథ ఆశ్రమం నిర్వాహకుడు దోర్నాల రామకృష్ణకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని ఎస్సై ఎం.సురేష్‌కు వివరించారు. దీంతో ఎస్సై వృద్ధుడిని వివరాలు అడుగగా నాకు నలుగురు కుమారులున్నారని, కుటుంబ కలహాల నేపథ్యంలో బయటకు వచ్చానని అన్నాడు. దీంతో పోలీసుల సూచనల మేరకు ఆ వృద్ధుడిని తమ అనాథాశ్రమానికి తరలించారు.

10న మధిరలో సీపీఎం నామినేషన్


సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

బోనకల్: ఈ నెల 10వ తేదీన మధిర అసెంబ్లీ నియోజకవర్గంలో సీపీఎం నామినేషన్ దాఖలు చేయనుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. మండలంలోని జానికీపురం తేజ్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నియోజకవర్గ పార్టీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018 నుంచి తెలంగాణలో బీజేపీ బలపడుతూ వచ్చిందని, అందుకోసమే బీఆర్‌ఎస్‌కు వామపక్షాలు మునుగోడు ఎన్నికల్లో బలపర్చాయని తెలిపారు. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వైరా, మిర్యాలగూడ నియోజకవర్గాలను కూడా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, మధిర డివిజన్ కన్వీనర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక


చింతకాని: బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

చింతకాని/బోనకల్: చింతకాని మండలంలోని రామకృష్ణాపురంకు, బోనకల్‌కి చెందిన పలు పార్టీల వారు జెడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమలరాజ్ సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కమల్‌రాజ్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మధిర నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, జెడ్పీటీసీ సభ్యులు పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, వైస్ ఎంపీపీ హనుమంతురావు, గ్రామసర్పంచ్ కుటుంబరావు, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు రమేష్, మండల కన్వీనర్ రత్నాకర్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, మోహన్‌రావు, సురేష్, ఉపేందర్, సత్యం, హనుమంతురావు, యాదగిరి,మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీను, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు కొండ, వెంకటేశ్వరరావు, సుధాకర్‌రావు, నర్సింహారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలాధారులకు భిక్ష


అయ్యప్ప మాలాధారులకు భిక్ష వడ్డిస్తున్న గోగులమూడి బాలాజీరెడ్డి

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జేవీఆర్ పార్కు ఎదురుగాగల శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి మాలధారణ భక్తులకు శుక్రవారం పట్టణానికి చెందిన గోగులమూడి బాలాజీరెడ్డి, శ్వేతారెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం(భిక్ష) నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున్‌శర్మ, దోసపాటి అమరలింగేశ్వరరావు, వందనపు సత్యనారాయణ, భీమిశెట్టి శ్రీనివాసరావు, పోలిశెట్టి శివకుమార్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ముప్వా దుర్గాప్రసాద్ దంపతులు

వర్తక సంఘం కల్యాణ మండపంలో..

మధిరరూరల్: మధిర పట్టణంలోని వర్తక సంఘం కల్యాణ మండపంలో శ్రీ స్వామి అయ్యప్ప అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో తొమ్మిదో రోజు జరిగిన కార్యక్రమానికి ముప్వా దుర్గాప్రసాద్ మాలాధారులకు అన్నదానం (భిక్ష) చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు.